క్లుప్తంగా

అసాంఘిక చర్యలకు పాల్పడితే నగర బహిష్కరణ

ఏసీపీ స్రవంతిరాయ్



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే నగర బహిష్కరణ తప్పదని నార్త్‌జోన్ ఏసీపీ స్రవంతి రాయ్ హెచ్చరించారు. సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆమె ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.వి లక్ష్మీనారాయణతో కలసి రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ షీటర్లపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. అనంతరం బయోమెట్రిక్ ద్వారా రౌడీషీటర్ల హాజరు నమోదు చేశారు.

రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లకు కౌన్సెలింగ్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్ కార్యాలయాల్లో సీపీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు, క్రైమ్ సస్పెక్ట్‌లకు పోలీస్ అధికారులు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని విడనాడి మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరిపై పోలీసుల నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా, ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: పాటకు ప్రాణం పల్లవి అని ప్రముఖ న్యాయవాది హజరత్తయ్య గుప్తా అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని అశీష్ స్టూడియోలో సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు సత్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ.. కళాకారులు ఆశించే నిజమైన బహుమతి ప్రోత్సాహమన్నారు. కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించాలని కళాసంస్థలకు సూచించారు. పినాకిని వెల్ఫేర్ అధ్యక్షుడు కె.మురళీ మోహన్ రాజు మాట్లాడుతూ.. గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు. కళాకారులను గౌరవించడం బాధ్యతగా భావిస్తున్నామన్నారు. గాంధీ వెల్ఫేర్ ట్రస్ట్ నిర్వాహకుడు గాంధీనాగరాజ్ పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకుల గాయనీ గాయకులను, అతిథి వేముల హజరత్తయ్య గుప్తాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని సంస్థ సభ్యురాలు కృష్ణవేణి నిర్వహించారు.

పేకాట శిబిరంపై దాడి.. 10 మంది అరెస్ట్

కృష్ణలంక(విజయవాడతూర్పు): గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై కృష్ణలంక పోలీసులు దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని లబ్బీపేటలోని చంద్రమౌళిపురంలో ఓ ఖాళీ స్థలంలో 10 మంది రిటైర్డ్ ఉద్యోగులు ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.44 వేలు నగదు, 11 సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థినికి వైఎన్నార్ చారిటీస్ ఆర్థిక సాయం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో తమ చారిటీస్ నుంచి పేద విద్యార్థులకు సహాయం చేయడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్ సమీపంలో ఉన్న కార్యాలయంలో ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్న మాన్యం భాగ్యశ్రీకి కళాశాల ఫీజు నిమిత్తం యలమంచిలి జయప్రకాష్ రూ.10 వేలను ఆదివారం అందజేశారు. డాక్టర్ గోపిచంద్, రాజగోపాల్, అనుమోలు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రజాధనం దుర్వినియోగం

- నిరుపయోగంగా ఉన్న ఫుట్‌పాత్‌కు రూ.90 లక్షలు ఖర్చు
- ఆక్రమణ చెరలో ఫుట్‌పాత్
- అధికార యంత్రాంగం తీరుపై ప్రజల విస్మయం



బీఆర్టీఎస్ రోడ్డులో ఫుట్‌పాత్



గులాబీతోట బీఆర్టీఎస్ రోడ్డుపై దుకాణాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డులో ఫుట్‌పాత్ టైల్స్‌ను ఎవరి కోసం మారుస్తున్నారో అర్థం కావటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుందరంగా ఉన్న బీఆర్టీఎస్ రోడ్డు ఫుట్‌పాత్ టైల్స్‌ను తొలగించి కొత్త టైల్స్ వేస్తున్నారు. అసలే ఆర్థిక లోటు అంటూ సంక్షేమ పథకాలను సైతం పక్కన పెడుతున్న చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా రూ.90 లక్షలతో బీఆర్టీఎస్ రోడ్డులో 3.2 కి.మీ మేర ఫుట్‌పాత్ టైల్స్ మార్పిడి, డివైడర్‌లు, ఆర్టీసీ బస్టాప్‌లకు రంగులు వేసే పనులు చేపట్టారు. చక్కగా ఉన్న ఫుట్‌పాత్ టైల్స్‌ను తొలగించటం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పాదచారులు నడిచేందుకు వీలులేని వైనం

సువిశాలంగా ఉండే బీఆర్టీఎస్ రోడ్డులో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఫుట్‌పాత్‌లు నిరుపయోగంగా మారాయి. ఇక్కడ భానూనగర్ నుంచి మధురానగర్ వంతెన వరకు ఫుట్‌పాత్‌పై భానూనగర్ వాసులు, హాకర్లు వారి సామాన్లు, వ్యాపారాలకు చెందిన తోపుడు బండ్లు ఉంచుతున్నారు. అలాగే భానూనగర్ జంక్షన్ నుంచి ఫుడ్ జంక్షన్ వరకు హాకర్లు, వ్యాపారులు వారి వ్యాపారాలకు చెందిన సామాగ్రి బండ్లు ఫుట్‌పాత్‌లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పాదచారులు రోడ్డుపైనే నడిచే అవకాశం లేకపోవటంతో ప్రమాదకరంగా రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుపై నడుస్తూ పలువురు గాయాలబారిన పడిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఫుట్‌పాత్‌లను దాటి బీఆర్టీఎస్ రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. కానీ ఇప్పుడు మాత్రం ఆకస్మాత్తుగా వినియోగంలో లేని ఫుట్‌పాత్ పనులను ప్రారంభించటం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఒక్క బస్సూ తిరగటం లేదు

బీఆర్టీఎస్ రోడ్డులో బస్సుల కోసం ఏర్పాటు చేసిన



బాగున్న ఫుట్‌పాత్ టైల్స్ తొలగించిన దృశ్యం

బస్టాప్‌లు నిరుపయోగంగా మారాయి. గతంలో ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు తిరిగేవి. కానీ గత కొంత కాలంగా ఆర్టీసీ బస్సులు తిరగటం లేదు. నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాప్‌లకు ఇప్పుడు మరమ్మతులు చేపట్టటం పట్ల స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు.

గోతులను పూడ్చండి సారూ...

ఇక్కడ నిరుపయోగంగా ఉండటంతో పాటు బాగానే ఉన్న ఫుట్‌పాత్, వినియోగంలో లేని ఆర్టీసీ బస్టాప్‌ల కోసం రూ.90 లక్షలు ఖర్చు చేస్తున్న అధికారులు పైపులైన్ పనుల కోసం తవ్విన గోతులను మాత్రం పూడ్చటం లేదని స్థానికులు వాపోతున్నారు. కేవలం కాంట్రాక్టర్‌ల కోసమే ఇక్కడ పనులు నిర్వహిస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇక్కడ పనులపై దృష్టి సారించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించాలి



బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో 2.0లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని.. బ్రాహ్మణులు వ్యాపారులుగా రాణించాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. స్థానిక సత్యనారాయణపురం నాడార్స్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో 2.0ను ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వారు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించటంతో పాటు ఇక్కడ తయారీ ధరలకే విక్రయించటం అభినందనీయమన్నారు. మహిళలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. ఈ ఏడాది 70 స్టాల్స్ ఏర్పాటు చేశారని వచ్చే సంవత్సరం వందకు పైగా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆయన స్టాల్స్‌ను స్వయంగా పరిశీలించి మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణీ మూర్తి, కొప్పవరపు బలరామకృష్ణమూర్తి, సూర్య కుమారి, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

నవరసాల విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు



శివాజీ కేఫ్ సెంటర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): తన విలక్షణ నటనతో ప్రతి పాత్రలోనూ పరకాయప్రవేశం చేసి ప్రేక్షకులను అలరించిన కోట శ్రీనివాసరావు మృతి తెలుగు సినీ పరిశ్రమతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఆదివారం సత్యనారాయణపురంలోని శివాజీ కేఫ్ సెంటర్‌లో కోట శ్రీనివాసరావు చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకున్న కోట మృతి బాధాకరమన్నారు. తెలుగు సినీ పరిశ్రమతో పాటు విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేగా కోట ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. సుమారు 750 సినిమాల్లో వివిధ పాత్రల్లో మెప్పించిన కోట పద్మశ్రీ అవార్డు, నంది అవార్డులను సొంతం చేసుకుని నటనా సామ్రాజ్యంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. ఆయన ఆత్మకు భగవంతుడు శాంతిని కలుగజేయాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణీమూర్తి, డివిజన్ అధ్యక్షుడు దోనేపూడి శ్రీనివాసరావు, నాయకులు సనత్, కోలవెన్ను కొండా, ఓగిరాల రాజశేఖర్, కంభంపాటి ప్రసాద్, మారుతి, సుధీర్ మాస్టర్ తదతరులు పాల్గొని నివాళులర్పించారు.

విద్యుత్ జేఎల్‌ఎం గ్రేడ్-2ను సంస్థలో విలీనం చేయాలి



మాట్లాడుతున్న ప్రసాద్

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ జేఎల్‌ఎం గ్రేడ్-2(ఎనర్జీ అసిస్టెంట్లు)ను సంస్థలో విలీనం చేయాలని, ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రెగ్యులేషన్స్ వర్తింపచేసి ఏఎల్‌ఎం ప్రమోషన్లు ఇవ్వాలని జేఎల్‌ఎం గ్రేడ్-2 రాష్ట్ర కన్వీనర్ పి.పెంచలప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక రాణిగారితోటలోని సీఐటీయూ కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(యూఈఈయూ) విజయవాడ సర్కిల్ రీజనల్ కమిటీ ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షుడు ఎల్.రాజు అధ్యక్షతన ఆదివారం జేఎల్‌ఎం గ్రేడ్ -2(ఎనర్జీ అసిస్టెంట్లు) ఉమ్మడి కృష్ణా జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచల ప్రసాద్ మాట్లాడుతూ జేఎల్‌ఎం గ్రేడ్-2లు నియమితులైన నాటి నుంచి వారి సమస్యలు పరిష్కారం కోసం దశల వారీగా యూనియన్ చేసిన ఆందోళన, పోరాటాలు ఫలితంగా కొన్ని హక్కులు సాధించుకున్నామన్నారు. ప్రధాన సమస్యలైన సర్వీస్ రెగ్యులేషన్స్, ఏఎల్‌ఎం ప్రమోషన్స్ సాధించాలని చెప్పారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులతో వేసిన కమిటీకి నివేదిక సమర్పించాలని, రాష్ట్ర వ్యాప్తంగా జేఎల్‌ఎం గ్రేడ్-2 నుంచి వ్యక్తిగతంగా సేకరించిన వేలాది మంది అర్జీలను అధికారులకు అందజేస్తామన్నారు.

19న సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా

యూనియన్ రీజనల్ కార్యదర్శి కనక లింగేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నతస్థాయి అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు సర్కిల్, డివిజన్‌లో అమలు చేయటం లేదన్నారు. ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు ఇచ్చి చాలాకాలం గడుస్తున్నా నేటికీ అమలు జరగలేదన్నారు. జేఎల్‌ఎం గ్రేడ్-2 సమస్యలపై ఈ నెల 19వ తేదీన సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాలని సదస్సు తీర్మానించిందన్నారు. యూనియన్ డిస్కం అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ఎనర్జీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు రాజేష్ మాట్లాడారు.


సాహిత్యం సమకాలీనమై ఉండాలి



గ్రంథావిష్కరణ సభలో మహ్మద్ ఇంతియాజ్, గోళ్ల నారాయణరావు, కొల్లూరి తదితరులు

విజయవాడకల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని కృష్ణాజిల్లా పూర్వపు కలెక్టర్ మహ్మద్ ఇంతియాజ్ అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో కవి ఎస్ఆర్ పృథ్వీ రచించిన పగిలిన జీవ కలలు దీర్ఘకవిత, నానో ప్రస్థానం పుస్తకావిష్కరణను ఆదివారం నిర్వహించారు. పగిలిన జీవన కలలు గ్రంథాన్ని ఆవిష్కరించిన ఇంతియాజ్ మాట్లాడుతూ కవిత్వంలో సామాజిక స్పృహ కనిపించాలన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు నేడు కవిత్వంలో వస్తున్న మార్పులను వివరించారు. నానో ప్రస్తనం లఘు కవితా సంపుటిని డెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్‌వీ రమణ ఆవిష్కరించారు. సభకు ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అధ్యక్షత వహించారు. సాహితీవేత్తలు మంజులూరి కృష్ణకుమారి, కావూరి సత్యవతి, ఎక్స్‌రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, కోశాధికారి సీహెచ్‌వీ సుబ్బయ్య, రచయిత పృథ్వీ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన



పార్టీ జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, మహిళలపై పట్టపగలే కూటమి నేతలు ఉన్మాదుల్లా దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ మహిళా నేతలు మండిపడ్డారు. పోలీసుల సమక్షంలోనే శనివారం గుడివాడలో కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు దాడి చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడికి పాల్పడ్డ గూండాలను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు దాడి చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నిస్తూ నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.

నిత్యం దాడులు, అత్యాచారాలు

ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, మహిళలపై దాడులు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాక్షాత్తు పోలీసుల సమక్షంలోనే మహిళలపై దాడులు జరుగుతుంటే, ఇక రాష్ట్రంలో మహిళలను కాపాడేది ఎవరని ప్రశ్నించారు. గుడివాడలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం మహిళలు, బాలికలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. దీనికి గుడివాడలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌పై చేసిన దాడే నిదర్శనమన్నారు. ఏపీఐడీసీ మాజీ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సంపతి విజిత తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వీఎంసీ పీజీఆర్ఎస్'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలకసంస్థ నగర వాసులకు కల్పించే మౌలిక వసతుల్లో నెలకొనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు నగరంలోని మూడు సర్కిళ్లలో నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయం, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ఆయా కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి సిగ్గుమాలిన చర్య

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌రాజ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వ పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందనడానికి జెడ్పీ చైర్‌పర్సన్, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రథమ పౌరురాలు ఉప్పాల హారికపై జరిగిన దాడి నిదర్శనమని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ, జనసేన గూండాలు సిగ్గువిడిచి మహిళలపై కూడా దాడికి దిగటం చూసి సభ్యసమాజం తల దించుకుంటుందని తెలిపారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధికే భద్రత లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని దాడులు చేసినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వారి మనోధైర్యాన్ని అంగుళం కూడా తగ్గించలేరని పేర్కొన్నారు. ఉప్పాల హారిక దంపతులకు వెంటనే క్షమాపణలు చెప్పి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేత

కేసరపల్లి(గన్నవరం): గ్రామంలోని అమ్మ వయోవృద్ధాశ్రమానికి ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ కార్యదర్శి రావి సురేష్‌బాబు రూ.10 వేలు విలువైన నిత్యావసర సరుకులు, పాలు, గుడ్లు, కూరగాయలు, మందులు అందజేశారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేయడంతో పాటు రూ. 3 వేలు నగదును విరాళంగా అందజేశారు. వృద్ధులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం ప్రతిఒక్కరూ అదృష్టంగా భావించాలని తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి. కిరణ్‌కుమార్, కోశాధికారి కేఎస్ఆర్‌కె. ప్రసాద్, డాక్టర్ లోయ సురేంద్ర, డాక్టర్ డి. సువర్ణబాబు, పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేం చేసిన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారికి ఆదివారం విశేష అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, తులసీ దళార్చన చేశారు. ఆలయ అర్చకులు వినుకొండ రత్నమాచార్యుల బృందం స్వామి వారికి పూజలు చేయగా, అభిషేకాలను వీక్షించేందుకు తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తుండగా, మరో వైపున భక్తులు గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. స్వామి వారికి పంచహారతుల సేవ నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్వామి వారికి ప్రతి మాసంలో శ్రవణా నక్షత్రాన విశేష అభిషేకాలు జరుగుతాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంగీత కళానిధి మల్లాది సూరిబాబు



సూరిబాబు దంపతులకు మంగళ శాసనాలు అందిస్తున్న కంచి వేద పండితులు



సూరిబాబును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడకల్చరల్: సంగీత కళానిధి మల్లాది సూరిబాబు అని ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సామగాన లహరి ట్రస్ట్ కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబు 80 జన్మదిన వేడుకల సందర్భంగా లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ సూరిబాబు గురువుల అనుగ్రహంతో సంగీత రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. మాజీ సీఎస్ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. మల్లాదిని సంగీత సరస్వతి అనుగ్రహించిందని సంగీత రంగంలో ఆయన చేయని ప్రయోగాలు లేవన్నారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు డి.రాఘవాచారి, ఎస్.రవికుమార్, అన్నవరపు రామస్వామి, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, భగవాన్ రమణ మహర్షి ట్రస్ట్ నిర్వాహకుడు అమెరికాకు చెందిన సూర్యప్రకాష్ సూరిబాబు సంగీత సేవలను వివరించారు. కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సర్వసతి, ఉత్తరాధికారి సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వార్లు సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబు దంపతులకు మంగళా శాసనాలను, పీఠం పక్షాన కానుకలను అందజేశారు.

సంగీత విద్వాంసుడు సూరిబాబుకు సత్కారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రముఖ సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబుకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆత్మీయ సత్కారం చేశారు. లబ్బీపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న సంగీత కార్యాలయంలో పాల్గొన్న మల్లాది సూరిబాబు 80వ జన్మదినాన్ని పురస్కరించుకుని మల్లాది విష్ణు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, సత్కరించారు. ఆకాశవాణిలో పనిచేసి పదవీ విరమణ పొందిన తర్వాత కూడా సంగీత విద్వాంసుడిగా అనేక కార్యక్రమాల్లో పాల్గొంటూ నేటికీ ప్రజల మన్ననలు పొందుతున్నారని మల్లాది విష్ణు అభినందించారు.

శ్యామలాంబదేవికి ఆషాఢ సారె సమర్పణ



సారె తీసుకువెళ్తున్న లచన్ ఇన్‌ఫ్రా మహిళా భక్తబృందం సభ్యులు



అమ్మవారికి సారె తీసుకువెళ్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారికి ఆదివారం లచన్‌ఇన్‌ఫ్రా మహిళా భక్త బృందం ఆధ్వర్యాన ఆషాఢ సారె సమర్పించారు. మేళతాళాలు డప్పు వాయిద్యాలతో సారె చేత పట్టుకుని జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ మీదుగా ఊరేగింపుగా వెళ్లి శ్యామలాంబదేవికి సారె సమర్పించారు. అనంతరం ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారి సారె స్వీకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తొలుత లచన్ ఇన్‌ఫ్రాలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లచన్ ఇన్‌ఫ్రా భక్తబృందం సభ్యులు ఇస్సంశెట్టి ఉషాజ్యోతి, నాగరాజు, చింతపల్లి చిన్ని, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లికి సారె

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ఆషాఢ మాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అలాగే భక్తులు, మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు.

300 మందికి నేత్ర వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్:బాపులపాడు మండలం కోడూరుపాడులో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని ఆర్సీఎం పాఠశాల ప్రాంగణంలో వైస్ ఎంపీపీ చందు రమాదేవి, వైఎస్సార్ సీపీ నేత చందు శ్రీనివాసరావు దంపతులు ఏర్పాటు చేసిన ఈ మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నాసా మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించే సంకల్పంతో తరుచుగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న చందు శ్రీనివాసరావు, రమాదేవి దంపతుల కృషి అభినందనీయమని సాంబశివరావు చెప్పారు. శంకర గ్రూప్ ఇనిస్టిట్యూషన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు శిబిరంలో సేవలు అందించారు. 300 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.

